

# మాటా మంతీ

## -సాయి పద్మ



**25**

## పడిలేచే కడలి తరంగాలు-సంవత్సరాల స్మృతులు

మళ్ళీ మరో సంవత్సరం వచ్చేస్తోంది...వడివడిగా ..జడిగా ఒక్కోసారి, అలజడిగా! నేను అనుకుంటూ ఉంటాను. ప్రతీ సంవత్సరం యేవో ఆశలతో మొదలెట్టేస్తాం. కొన్ని రిజల్యూషన్స్, మరికొన్ని ఇల్యూషన్స్. భలే విచిత్రంగా అనిపిస్తుంది. న్యూ ఇయర్ అనేది ఎప్పుడు పండగలా మారిందో ఆలోచిస్తే, నిజానికి మన కొత్త సంవత్సరం ఉగాది అయినా.. న్యూ ఇయర్ కే మన వోటు. అదే రోజు పనులు మొదలెట్టేవాళ్ళు, ప్రేమలు, బంధాలు మొదలెట్టే వాళ్ళు. ఎటు చూసినా కొత్తదనమే, పచ్చదనమే ( ప్లాస్టిక్ పూలల్లా )

నిజానికి మనకి సెలబ్రేషన్ కి ఒక సాకు కావాలి, రొటీన్ జీవితం నుండి భిన్నత కావాలి. ఏదో ఏదో, అర్ధం కాని కొత్తదనం కావాలి. చేతిలో ఉన్న ఒక రోజునే సరిగ్గా ప్లాన్ చేసుకోలేని మనం, ఆ రోజుల సముదాయం అయిన, సంవత్సరం మాత్రం ఏదో చాలా బాగా జరిగిపోవాలని ఆశపడతాం. న్యూ ఇయర్ అని స్పెషల్ పూజలు, బాబా గుళ్ళో, లేకపోతే ఇంకే మఠాలో వెళ్లి అర్జెంటు గా మొక్కేసుకోవటం, ఇలాంటివి అలాంటి ఇన్స్టంట్ సెలబ్రేషన్ లో భాగాలు అన్నమాట. విచిత్రంగా లేదూ, మనం చేసే చర్యలు మాత్రం ఏమీ మారవు. ఫలితాలు మాత్రం మారాలని కోరుకుంటాం. ఏపిల్ మొక్క వేసి, మామిడి పళ్ళు కాయాలంటే, ఎంత హైబ్రీడ్ కోరికైనా, తీరుతుందా ?

నేనైతే మారదామని నిశ్చయించుకున్నాను. అందుకే, కొత్త సంవత్సరం గురించి చూడకుండా ఒక రెండు వారాల ముందుగానే. నాకూ ఈ జ్ఞానం అంత వీజీ గా రాలేదు, చాలా పడి లేస్తే వచ్చింది. అంటే, సరదాకి కాదు, నిజంగానే భారీగా బాత్రూంలో పడ్డాను అండీ.. తల వెళ్లి, టాప్ రాడ్ కి కొట్టుకొని, నడుం అంచు కమోడ్ కి తగిలి, బొక్క బోర్లా పడ్డాను. బాత్రూం తలుపు వేసుకోవటం వల్ల, నేనే చాలా ఇబ్బంది పడి, విపరీతమైన నెప్పిలో, నీళ్ళ మధ్య ( నేను పడి, వేడివేడి నీళ్ళ బకెట్ ని కూడా పడేసాను మరి..) ఎలాగో.. కాస్త కాస్త కదలి, అరగంట తర్వాత తలుపు తీస్తే గానీ.. ఎవరూ లోపలకి నా సాయానికి రాలేని పరిస్థితి. తలచుకుంటే ఒళ్ళు జలదరిస్తుంది. శారీరక బాధ కన్నా, మానసిక స్థితిలో ఉండే నిస్సహాయత, కోపం, వేదన. అంత దుఖంలోనూ నాకు గుర్తొచ్చింది ఏంటో తెలుసాండీ.. నేను కౌన్సెలింగ్ చేస్తూ, సపోర్ట్ చేస్తున్న ఒకమ్మాయి. ఆ అమ్మాయి ఒక రేర్ డిజేబిలిటీ తో బాధ పడుతోంది. దాని పేరు 'ఆస్తో జెనిసిస్ ఇమ్పెర్ఫెక్తా (osteogenesis imperfecta) ' ఈ డిసీజ్ ఉన్నవాళ్ళకి, బోన్స్ చాలా బ్రిటిల్ గా అంటే, పెళుసుగా ఉంటాయి. ముట్టుకుంటే విరిగిపోయే కండిషన్ ఉన్న పేషెంట్స్ ఉన్నారు. నాలా పడిపోయి ఉంటె, ఆ అమ్మాయి ఎన్ని ముక్కలయి ఉండేది? అంత నొప్పిలోనూ దుఖం ఆగిపోయింది. శారీరక బాధ మిగిలింది. జ్ఞాన బోధ అని అనను గానీ.. పారలల్ గా ఎవరికీ ఏదీ ఫుల్ గా దొరకదు, ఎంతో కొంత దుఖం , బాధ లేకపోతే ఏదన్నా చేద్దామన్న ఇన్స్పిరేషన్ కూడా రాదేమో.

ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే, నేర్చుకోవటం, మారటం ఏదీ ఎక్కడా ఆగిపోదు. చివరి శ్వాస దాకా..ఎంతో కొంత నేర్చుకొంటూనే ఉంటాం. రోజూ నేర్పే పాఠాలు కొన్ని అయితే. పడిలేచే కెరటాల్లా వస్తూ.. మనలోని నేగేటివిటీనీ, నిరాశ నీ కూడా పట్టికెళ్ళిపోతాయి. ఇక్కడే జాగ్రత్తగా ఉండాల్సింది.. ఏం ఖాళీ చేస్తున్నాం ? ఏం మనతో కెరీ చేస్తున్నాం? – అనేది.. ఈ సంవత్సరం నా టేక్ ఎవే .

రిజల్యూషన్స్ కంటా, మనం ఏం నేర్చుకున్నామో , ఎలా మారుతున్నామో గమనిస్తే, మనకి మనల్ని మించిన రీసెర్చ్ టాపిక్ ఉండదేమో.

ఎంతో కొంత ఖాళీ చేస్తేనే నింపుకోగలం

జ్ఞానమైనా, ప్రేమైనా

ఎంతో కొంత దుఖపడితేనే అందుకోగలం

మమతనైనా, మనిషినైనా

ఎంతో కొంత సంతోషిస్తేనే ఇవ్వగలం

కరుణనైనా, స్నేహమైనా

ఎంతో కొంత పరిణితి ఉంటెనే చూడగలం

లక్ష్యాన్నైనా , విజయాన్నైనా

ఎంతో కొంత వదిలేస్తేనే పొందగలం

క్షమనైనా, శాంతినైనా

అవును కదూ.. మీ అందరికీ, నా తరపునా, మా గ్లోబల్ ఎయిడ్ కుటుంబం తరపునా, హృదయ పూర్వక నూతన సంవత్సర శుభాకాంక్షలు... wishing you a great year of evolution than just making resolution...!! Happy New Year ..!! మళ్ళీ వచ్చే నెల కలుద్దాం

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments